## ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం

కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

ఆదివారం | 07 డిసెంబరు, 2025 | పేజీలు :06

## పోలింగ్ కేంద్రాల పరిశీలన



**ప్రజా పక్షం/వేములవాడ:** గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మొదటి ఫేజ్ ఎన్నికలు నిర్వహించనున్న పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు రవికుమార్ శనివారం పరిశీలించారు. వేములవాడ అర్బన్ పరిధిలోని చీర్లవంచ, మారుపాక, చింతలతాన, కోనరావుపేట మండలంలోని కొలనూరు, మర్తనపేట లోని పోలింగ్ కేంద్రాలను జిల్లా సాధారణ ఎన్నికల పరిశీలకులు రవికుమార్ సందర్శించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. పరిశీలనలో ఆయా మండలాల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పకడ్బందీగా ఎన్నికల సామాగ్రి పంపిణీ

### కలెక్టర్ అభిలాష అభినవ్

**ప్రజాపక్షం/నిర్మల్ :** గ్రామపంచాయతీ ఎన్నికల ప్రక్రియలో ఎటువంటి లోటుపాట్లు కలగకూడదని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తన చాంబర్లో గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నామినేషన్ల అప్లికేషన్ల సంబంధించి వివరాలను, మూడు దశల్లో కలిపి సర్పంచ్, వార్డు మెంబర్ స్థానాలకు దాఖలైన అధికారులను అడిగి తెలుసుకున్నారు. అవసరమైనన్ని బ్యాలెట్ పేపర్లను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాలలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు.హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి ఎన్నికల విధులు నిర్వర్తించే అధికారులకు సమాచారం అందివ్వడంలో తోడ్పాటు అందించాలన్నారు. ఎన్నికల కేంద్రాలకు చేరుకోవడానికి అవసరమైన వాహనాలను సిద్ధం చేసుకోవాలని పేర్కొన్నారు. కౌంటింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించాలని తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొనబోయే అధికారులు అందరికీ గుర్తింపు కార్డులను ఇవ్వాలని చెప్పారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, డిపిఓ శ్రీనివాస్, డీఈవో భోజన్న, జెడ్పీ సీఈవో శంకర్, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



### ప్రజా సమస్యల
## పరిష్కారం దిశగా చర్యలు



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** పోలీస్ స్టేషన్కు వచ్చే సామాన్య ప్రజల సమస్యల పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ అన్నారు. శనివారం రోజున పెద్దపల్లి లో ఇటీవల నూతనంగా ప్రారంభించిన రూరల్ పోలీస్ స్టేషన్ ను సందర్శించి, అనంతరమైన మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాలలో ఎన్నికల సరళి గురించి నామినేషన్ కేంద్రాలు(క్లస్టర్ల) వద్ద బందోబస్తు గురించి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఎన్ని ఉన్నాయో అధికారులను అడిగి తెలుసుకొని పలు సూచనలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. అదేవిధంగా రౌడీషీటర్ల వివరాలు తెలుసుకొని వారి కార్యకలాపాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. గ్రామ స్థాయిలో పనిచేస్తున్న పోలీస్ సిబ్బంది తమతమ గ్రామాల్లో ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని తెలిపారు. పోలీస్ స్టేషన్ పరిసరాలు శుభ్రంగా ఉంచాలని, రికార్డుల నిర్వహణ, సిబ్బంది క్రమశిక్షణ తో విధులు నిర్వహించాలని, విజబుల్ పోలీసింగ్ నిర్వహించాలని, గ్రామాలలో పెట్రోలింగ్ నిర్వహించాలని, ప్రజల భద్రత శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు వ్యవస్థ మరింత బలోపేతం కావాల ని ఆ కాంక్షించారు. ఈ కార్యక్రమంలో రూ రల్ ఎస్సైమల్లేష్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

## దాడి చేసిన వారిపై కఠిన చర్యలు

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** బీసీ బిడ్డ యాదగిరి యాదవ్ పై దాడి చేసిన సందీప్ రెడ్డి అతనికి సహకరించిన వారిపై కఠిన చర్యలు తీసుకుని పిడి యాక్ట్ నమోదు చేయాలని బీసీ హక్కుల సాధన సమితి జిల్లా కన్వీనర్ పంతం రవి డిమాండ్ చేశారు. శనివారం సుభాష్ నగర్ సిపిఐ కార్యాలయంలో బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకున్న సాయి ఈశ్వర చారికి మౌనం పాటించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో 42 శాతం బిసి రిజర్వేషన్ల పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న మోసపూరిత వైఖరికి నిరసనగనే సాయి ఈశ్వర్ చారి అమరుడయ్యాడని ఇప్పటికైనా ఈ విషయంపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి బీసీలకు రిజర్వేషన్ల విషయంలో స్పష్టమైన వైఖరి ప్రకటించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికలలో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తానని ప్రకటించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కనీసం బీసీలను స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ కూడా చేయకుండా అడ్డుకునే ప్రయత్నాలు చేస్తుంటే బీసీల పట్ల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతుందన్నారు. నల్లగొండ నైజాముగా మారిన రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అతని అనుచరులు నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలం ఎల్లమ్మ గూడెం సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నాగలక్ష్మి అతని భర్త యాదగిరి యాదవ్ పై మానవ సమాజం తలదించుకునేలా ప్రవర్తించిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని వెంటనే మంత్రివర్గం నుండి బహిష్కరించాలని దాడికి పాల్పడ్డ వారిపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకొని పిడి యాక్ట్ నమోదుచేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీసీ సంఘం నాయకుడు సోమ నాగరాజు, మీసం లక్ష్మ ణ్, సదానందం తదితరులు పాల్గొన్నారు.



# శాతవాహనలో సౌత్ జోన్ వాలీబాల్ ఎంపికలు

**ప్రజాపక్షం/కరీంనగర్:** కాకినాడ జెఎన్టియులో జరగనున్న సౌత్ జోన్ అంతర్ విశ్వవిద్యాలయ వాలీబాల్ టోర్నమెంట్ కోసం శాతవాహన విశ్వవిద్యాలయంలో క్రీడాకారుల ఎంపికలు జరిగాయి. ఈనెల 10 నుంచి 14 వరకు కాకినాడలో ఈ పోటీలు జరగనున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఉపకులపతి ఆచార్య ఉమేష్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలలో అత్యున్నత ప్రతిభ కనబరచి విశ్వవిద్యాలయానికి పేరు తీసుకురావాలని కోరారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని, చదువుతోపాటు క్రీడలలో కూడా రాణించి శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. అంతర్ విశ్వవిద్యాలయ పోటీలలో పతకాలు సాధించేందుకు విద్యార్థులకు కావలసిన శిక్షణ ఇప్పిస్తామని, అవసరమైతే హైదరాబాద్, ఇతర ప్రాంతాల నుంచి నిపుణులైన కోచ్ లను రప్పిస్తామని హామీ ఇచ్చారు. ఒఎస్‌డి టు విసి డాక్టర్ హరికాంత్ మాట్లాడుతూ క్రీడాకారులు విశ్వవిద్యాలయానికి, తాము చదివిన విద్యాసంస్థలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ నజీముద్దీన్ మునావర్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ డాక్టర్ మనోజ్ కుమార్, పిఆర్ఒ, పిడి విజయకుమార్, వివిధ కళాశాలల వ్యాయామ అధికారులు దినేష్, నాగేశ్వరరావు, శ్రీనాథ్, సతీష్ రాజు, వివిధ కళాశాలల క్రీడాకారులు పాల్గొన్నారు.



## ఘనంగా అంబేద్కర్ వర్ధంతి

**ప్రజాపక్షం/వీర్నపల్లి:** మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు నాంపల్లి మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ మల్లేశం, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు భగవంతం, నాయకులు అరుణ్ కుమార్, దినాకర్, రవి, శ్రీనివాస్, రాములు, ప్రశాంత్, సుదర్శన్, కాంతయ్య, తిరుపతి, లింబాద్రి, రాజం, సంజీవ్ పాల్గొన్నారు.

**గర్జనపల్లిలో...**

మండల కేంద్రంలోని గర్జనపల్లి ఉన్నత పాఠశాలలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘన నివాళులు అర్పించారు. హెచ్ ఎం శ్రీనివాస్‌తో పాటు ఉపాధ్యాయులు ప్రేమ్ సాగర్, బలరాం, మంజుల, శ్రీనివాస్, కవిత, విద్యార్థులు పాల్గొన్నారు.

### వేములవాడలో

**ప్రజాపక్షం/ వేములవాడ :** రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వేములవాడ మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు పిలుపునిచ్చారు. శనివారం అంబేద్కర్ 67వ వర్ధంతిని పురస్కరించుకుని వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లి గ్రామంలో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి రొండి రాజు పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు సమాన హక్కులు కల్పించిన ఘనత అంబేద్కర్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, పాల్గొన్నారు.

### మల్లాపూర్‌లో

**ప్రజాపక్షం/మల్లాపూర్:** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 69వ వర్ధంతి వేడుకలను మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం సంగెం శ్రీరాంపూర్ గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరు నడుచుకోవాలని సూచించారు. అదేవిధంగా మండల కేంద్రంలో అంబేద్కర్ సంఘ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.ఈ కార్యక్రమాలలో అంబేద్కర్ సంఘ నాయకులు ప్రజాప్రతినిధులు ఉన్నారు.

### మెట్ పల్లిలో

**ప్రజాపక్షం/మెట్ పల్లి:** పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యలయంలో శనివారం రాజ్యాంగం నిర్మాత డాక్టర్ బిఆర్. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా కోరుట్ల నియోజకర్గ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగ్ రావు, వారి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు జెట్టి లింగం, రాంప్రసాద్, జెట్టి లక్ష్మ ణ్ , పుల్లూరి వెంకటష్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఉపాధి కల్పించే దిశగా కోర్సుల నిర్వహణ



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** విద్యార్థులకు ఉపాధి కల్పించే దిశగా కోర్సులు నిర్వహిస్తున్నామని మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కాలేజీ డైరెక్టర్లు ఎడవల్లి నవీన్ కుమార్, ఎడవల్లి నవత, కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ తెలిపారు. శనివారం రోజునమదర్ తెరిసా ఇంజనీరింగ్ కళాశాలలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆవిష్కరణ ముఖ్యఅతిథిగా దేశ రక్షణ మంత్రిత్వ శాఖ ముఖ్య సైంటిఫిక్ అడ్వైజర్ డాక్టర్ జి సతీష్ రెడ్డి హాజరైనారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ ఈ సెంటర్ ద్వారా ఇండస్ట్రీ అకాడమిక్ రీసెర్చ్ ప్రభుత్వాన్ని అనుసంధానం చేస్తూ విద్యార్థులకు ఎప్పటికప్పుడు ఎమర్జింగ్ టెక్నాలజీ పై శిక్షణను ఇచ్చి ఉద్యోగం కల్పించే దిశగా కోర్సులు నిర్వహిస్తారని తెలిపారు.రీసెర్చ్ హైట్స్ ఫౌండేషన్ సీఈవో నాగేందర్ అనుబంధముతో ట్రై ఇంపాక్ట్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ని నేడు కళాశాలలో ఆవిష్కరించారు.దేశ డిఫెన్స్ మినిస్ట్రీ ముఖ్య సైంటిఫిక్ అడ్వైజర్ అయిన డాక్టర్ జి సతీష్ రెడ్డి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ని ఆవిష్కరించారు.ఈ కార్యక్రమానికి రీసెర్చ్ హైట్స్ ఫౌండేషన్ సీఈఓ నాగేందర్ ఏజీఎం నాబార్డ్ ఎస్ జయ ప్రకాష్ గారు ముఖ్య అతిథులుగా విచ్చేశారు.కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ ఎడవల్లి నవత మాట్లాడుతూ దశాబ్దకాలంగా తమ కళాశాలలో ఎప్పటికప్పుడు విద్యార్థులకు చదువుతోపాటు కమ్యూనికేషన్స్ స్కిల్స్ టెక్నికల్ స్కిల్స్ నేర్పిస్తూ ప్రతి సంవత్సరం కూడాక్యాంపస్ ప్లేస్మెంట్స్ నిర్వహిస్తూ ఎక్కువ మంది విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్టు తెలిపారు.ఈ కార్యక్రమంలో అకౌంట్స్ ఆఫీసర్ పవన్ కుమార్ ,విభాధిపతులు చంద్రగిరి, వంశీరాజ్ ,డాక్టర్ వూట్ల శ్రీధర్, బూర్ల సంతోష్, ఏ శశికాంత్,శ్రీధర్ ,జయంత్ రెడ్డి ,రమేష్, రమ్య ,సవిత ,తదితరులు పాల్గొన్నారు.

## శాంతియుత వాతావరణంలో ఎన్నికలే లక్ష్యం



**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** శాంతియుత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ లక్ష్యమని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ జూ అన్నారు. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో శాంతియుత వాతావరణంలో ఎన్నికలే నిర్వహణ లక్ష్యంగా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లలలో భాగంగా సుల్తానాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దుబ్బపల్లి వద్ద వాహన తనిఖీలు చేపడుతున్న స్టాటిక్ సర్వేలేయన్స్ చెక్ పోస్ట్ ను రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా సందర్శించారు. వాహన తనిఖీల వివరాల రిజిస్టర్ ను సీపీ తనిఖీ చేశారు. ఓటర్లను ప్రలోభ పెట్టే విధంగా నగదు, మద్యం, ఇతర వస్తువులను అక్రమ రవాణాకు ప్రయత్నించే వారిపై ఎన్నికల నియమావళి ప్రకారం కేసులు నమోదు చేయాలని అధికారులకు సూచించారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి,అట్టి వాహనాల వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. సిబ్బంది వాహనాలను తనిఖీ సమయంలో తగిన జాగ్రత్త లు రేడియయం జాకెట్స్ వేసుకోవాలని, లైట్స్ అందుబాటులో ఉంచుకోవాలని స్వీయ రక్షణ చర్యలు తీసుకోవాలని, ఎప్పుడు అప్రమత్తం గా ఉండాలని సూచించారు. పెద్దపల్లి జోన్ వ్యాప్తంగా ఏర్పాటు చేసిన అన్ని చెక్ పోస్ట్ ల్ వద్ద నిత్యం వాహన తనిఖీలు చేపట్టడం జరుగుతుందని ఈ సందర్భంగా సీపీ తెలిపారు. ముందస్తు సమాచారాల్ని సేకరించి ఏలాంటి సంఘటనలు ప్రచారం సమయంలో, పోలింగ్ ముందు రోజు, పోలింగ్ రోజున, ఫలితాలు వెల్లడించిన తరువాత ఎలాంటి అవాంఛినిఘటనలు చోటు చేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.అనుమానాస్పద వ్యక్తులపై, ట్రబుల్ మాంగర్స్ పై 24/7 పర్యవేక్షణ ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ సుబ్బారెడ్డి , ఎస్సై పాల్గొన్నారు.

## నూతన కోర్టులతో కక్షిదారులకు సౌలభ్యం



**ప్రజాపక్షం/సుల్తానాబాద్:** కక్షిదారుల సౌలభ్యం కోసమే నూతన కోర్టులను ఏర్పాటు చేస్తున్నట్లు తద్వారా సత్వర న్యాయం అందుతుందని హైకోర్టు న్యాయమూర్తి, పెద్దపల్లి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి లక్ష్మి నారాయణ అలిశెట్టి అన్నారు. సుల్తానాబాద్ కోర్టు ఆవరణలో నూతనంగా మంజూరైన అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ను శనివారం హైకోర్టు న్యాయమూర్తులు లక్ష్మీ నారాయణ అలిశెట్టి, పుల్ల కార్తీక్, జే. శ్రీనివాస రావు లు ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం హైకోర్టు న్యాయమూర్తులు మాట్లాడుతూ కోర్టుల్లో దీర్ఘకాలంగా ఉన్న పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు నూతన కోర్టులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆయా నూతన కోర్టులకు జడ్జిలను నియామకం చేస్తున్నట్లు తెలిపారు. కక్షిదారులకు న్యాయ వ్యవస్థ పై నమ్మకం కల్పించేలా న్యాయవాదులు వృత్తిలో నైపుణ్యం పెంచుకోవాలని సూచించారు. సుల్తానాబాద్ కోర్టు ఆవరణలో విశాలమైన స్థలం ఉందని సబ్ కోర్టు, జిల్లా కోర్టును సుల్తానాబాద్ లో ఏర్పాటు చేయాలని కోరుతూ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేకల తిరుపతి రెడ్డి హైకోర్టు న్యాయమూర్తులకు వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా జడ్జి సునీత కుంచాల, అదనపు జిల్లా జడ్జి టీ.శ్రీనివాస రావు, జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేశ్, జిల్లా లోని పలు కోర్టుల న్యాయమూర్తులు, రామగుండం సీపీ అంబరి కిషోర్ జూ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేకల తిరుపతి రెడ్డి, గుడ్ల వెంకటేష్ లతో పాటు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## వైన్ షాప్ ముందు రోడ్డు పైన టు వీలర్ పార్కింగ్



**ప్రజాపక్షం/రామగిరి:** పెద్దపల్లి మంథని ప్రధాన రహదారి లో శనివారం కల్వచర్లలో నాగరాజు బ్రదర్స్ వైన్ షాప్ ముందు ప్రధాన రహదారి పైన టూ వీలర్ బైక్స్ పార్కింగ్ ఉంచారు నిత్యం అధికంగా బస్సులు లారీలు రవాణా జరిగే ఈ రహదారిపై వైన్ షాప్ ముందు రాత్రిపూట రోడ్డుపైన బైకులు పెట్టడం వలన ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది ఈ వైన్ షాపు ముందు పోలీసు ఎక్సైజ్ డిపార్ట్మెంట్ రోడ్డు పైన బైకులు పెట్టకుండా చూడాలని స్థానికులు వెల్లడిస్తున్నారు.

## విజ్ఞానాన్ని అందించేందుకే ‘ట్వినింగ్ ఆఫ్ స్కూల్స్’

**ప్రజాపక్షం/వీర్నపల్లి:** విద్యార్థులకు విజ్ఞానాన్ని అందించేందుకు ‘ట్విన్నింగ్ ఆఫ్ స్కూల్స్’ ప్రోగ్రాం ఎంతగానో దోహదపడుతుందని వీర్నపల్లి పిఎంశ్రీ ఎంపిపిఎస్ ప్రధానోపాధ్యాయులు ఎం ఉదయ లక్ష్మి అన్నారు. కార్యక్రమంలో భాగంగా 3,4,5వ తరగతి విద్యార్థులతో సిరిసిల్లలోని పిఎంశ్రీజెడ్పీహెచ్ గీతానగర్ పాఠశాలను శనివారం సందర్శించారు. పాఠశాలలోని ల్యాబ్, గ్రంథాలయం, ఆర్ట్ రూం, ఆట మైదానంను పరిశీలించారు. ఈ సందర్శన వలన రెండు పాఠశాలల మధ్య మిత్రత్వాన్ని పెంపొందించడమే కాక, విద్యార్థులకు ఎన్నో నూతన విషయాలను నేర్చుకోవడానికి ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రజిత, ప్రవీణ, మౌనిక, మనోజ్ కుమార్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ముగిసిన మూడవ విడత నామినేషన్లు

**ప్రజాపక్షం/ధర్మపురి :** జగిత్యాల జిల్లాలో మూడవ విడత పంచాయతీ ఎన్నికల్లో ధర్మపురి నియోజకవర్గంలోని ఆరు మండలాలలో నామినేషన్ ప్రక్రియ బుధవారం ముగిసింది.ధర్మపురి నియోజకవర్గ పరిధిలోని 6 మండలాలైన ధర్మపురి, వెల్గటూర్, బుగ్గారం, గొల్లపల్లి, పెగడపెల్లి, ఎండపెల్లి పరిధిలో మొత్తం 119 గ్రామ పంచాయతీ లకు గాను 873 మంది సర్పంచ్ స్థానాలకు నామినేషన్లు వేశారు.అదేవిధంగా 1088 వార్డులకు 2639 మంది నామపత్రాలు సమర్పించారు. ఇక ధర్మపురి మండలంలో 25 గ్రామ పంచాయతీ లకు 150 మంది సర్పంచ్ స్థానానికి నామినేషన్ వేయగా 224 వార్డు స్థానాలకు 501 మంది నామినేషన్లు దాఖలు చేశారు.కాగా ఆరు మండలాలలో దాఖలైన నామినేషన్లను అధికారులు పరిశీలించి అన్ని సక్రమంగా ఉన్నట్లు చెప్పారు.

## మీలో ఒకడిగా ఉంటా సేవచేసి చూపిస్తా

**ప్రజాపక్షం /మల్లాపూర్ :** నా వంతు సహాయ సహకారాలు చేస్తూ గ్రామంలో సేవ చేస్తూ మీలో ఒకడిగా ఉన్నానని ఆశీర్వదించి గెలిపిస్తే సేవ చేసి చూపిస్తానని బిజెపి సర్పంచ్ అభ్యర్థి గోపిడి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం ఇంటింటా ప్రచారంలో భాగంగా మేర సంగం కులస్తులను కలిసి గ్రామ అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వస్తున్నాననీ ఆశీర్వదించి మెజార్టీతో గెలిపించాలని కోరారు. అలాగే పలు వార్డుల్లో ప్రచారం నిర్వహించే ఉంగరం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను ఆకాంక్షించారు. వీరి వెంట మద్దతుదారులు తదితరులు ఉన్నారు.

## నేడు విద్యుత్ సరపరాలో అంతరాయం

**ప్రజా పక్షం/మల్యాల :** జగిత్యాల జిల్లా మల్యాల మండలం తక్కళ్లపెల్లి 11 కెవి విద్యుత్ ఫీడర్ పరిధిలోని గ్రామాల్లో ఆదివారం విద్యుత్ వైర్లకు తగిలే చెట్ల కొమ్మలను తొలగించనున్నందున విద్యుత్ సరఫరా ఉదయం 08:30 గంటల నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు నిలిపి వేయనున్నట్లు మల్యాల ట్రాన్స్కో ఏఈ దయా నంధ్ ఒక ప్రకటనలో తెలిపారు.దీని వలన మల్యాల సబ్ స్టేషన్ పరిధిలో మల్యాల వ్యవసాయబావులకు, గృహ వినియోగదారులకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని, ఏ ఈ వివరించారు.ఈ విద్యుత్ అంతరాయనికి వినియోగదారులు ,రైతులు సహకరించాలని ఏ ఈ కోరారు.

# ఎడపల్లి మండలంలో ఎన్నికల వేడి

## కుల సంఘాలతో బేరసారాలు..
## రహస్యంగా ఓటర్లతో మంతనాలు..





**ప్రజాపక్షం/ఎడపల్లిః** స్థానిక సర్పంచ్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఎడపల్లి మండలంలో వినూత్న రాజకీయ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఎన్నికల్లో విజయం సాధించేందుకు అభ్యర్థులు నేరుగా ఓటర్లనే కాకుండా, కుల సంఘాలనే ప్రధాన లక్ష్యంగా చేసుకుంటున్నారు. మరోవైపు, ఓటర్లు మాత్రం అభ్యర్థుల ప్రలోభాలకు లొంగకుండా తెలివిగా వ్యవహరిస్తున్న తీరు అభ్యర్థులను తీవ్ర ఆందోళనలోకి నెట్టివేసింది.

### కుల సంఘాలే లక్ష్యంగా...

సర్పంచ్ అభ్యర్థులు తమ గెలుపును సులభతరం చేసుకునేందుకు వ్యక్తిగత ప్రచారం కంటే గంపగుత్త ఓట్లను సాధించడంపై దృష్టి సారించారు. దీని కోసం ఏకంగా మండలంలోని వివిధ కుల సంఘాల పెద్దలను కూర్చొబెట్టి, వారికి భారీ మొత్తంలో లక్షల రూపాయాలను ఎరగా వేస్తున్నట్లు తెలుస్తుంది. అంతేగాకుండా గెలిచిన వెంటనే సంఘాలకు పెద్ద మొత్తంలో ఆర్థిక సహాయం చేస్తామని, అలాగే సంఘాల కుల దైవాల గుళ్లు, గోపురాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని బహిరంగంగా హామీలు గుప్పిస్తున్నారు.

### తెలివిగా వ్యవహరిస్తున్న ఓటర్లు...

అయితే అభ్యర్థులు ఇస్తున్న హామీలు, అందిస్తున్న ప్రలోభాలకు మండలంలోని ఓటర్లు భిన్నంగా స్పందిస్తున్నారు. అభ్యర్థుల గుణగుణాలు, నేపథ్యం తెలిసిన జనాలు అందరి అభ్యర్థుల వద్ద డబ్బు తీసుకుంటున్నా.. రహస్యంగా మాత్రం తమకు నచ్చిన ముందుగా అనుకున్న వారికే ఓటు వేస్తామని లోలోపల మంతనాలు జరుపుతున్నారు. ఎన్నికలు అనేవి ఐదేళ్లకోసారి వస్తాయి. ఇప్పుడు అభ్యర్థులు ఇచ్చే డబ్బును తీసుకున్నా.. చివరికు మనకు మంచి చేసే వారికే ఓటు వేయాలనేది వారి అంతర్గత ఆలోచనగా ఉంది.

### కలవరంలో అభ్యర్థులు...

ఓటర్ల ఈ తెలివైన వైఖరి సర్పంచ్ అభ్యర్థులను తీవ్రంగా కలవరపెడుతోంది. తాము లక్షల రూపాయాలు ఖర్చు చేసి సంఘాలకు హామీలు గుప్పించినా సరే, ఖచ్చితంగా ఓట్లు పడతాయో లేదో అనే గందరగోళంలో కొందరు అభ్యర్థులు ఉన్నారు. డబ్బు పంచినా ఓట్లు వస్తాయో రావో అనే మీమాంసంతో ప్రచార వేళ కూడా వారు ఆందోళన చెందుతున్నట్లు సమాచారం. మొత్తంగా ఎడపల్లి మండలంలో ఈ ఎన్నికలు డబ్బు, ప్రలోభాలకు అతీతంగా ఓటరు విచక్షణకు పరీక్షగా నిలుస్తున్నాయి. ప్రజలు తమ ఓటు హక్కును తెలివిగా వినియోగించుకునే దిశగా సాగుతున్నారని ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి.

## బడిబయట విద్యార్థుల సర్వే

**ప్రజాపక్షం/బోధన్ః** బోధన్ మండలంలో బడిబయట పిల్లల సర్వేను క్లస్టర్ రిసోర్స్ పర్సన్‌లు సమర్థవంతంగా నిర్వహిస్తున్నట్లు బోధన్ ఎంఈఓ నాగయ్య తెలిపారు. శనివారం బోధన్ మండలంలో బడిబయట విద్యార్థుల సర్వేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ నాగయ్య మాట్లాడుతూ.. సిఆర్‌పి విజయ్ ద్వారా పెంట కుర్దు కాంపెక్స్ పరిధిలోని భవానిపేట్ గ్రామంలో బడి బయట ఉన్న పిల్లలను సర్వేను నిర్వహించడం జరిగిందని అక్షయ అనే విద్యార్థిని గుర్తించి కౌన్సిలింగ్ నిర్వహించిన అనంతరం సమీపంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సంగం పాఠశాలలో చేర్పించామని ఎంఈఓ తెలిపారు. భవానిపేట్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కార్తిక్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సంగం ప్రధానోపాధ్యాయులు ఆదినారాయణ పాల్గొన్నారు.

## బోధన్‌లో సాయి ఈశ్వరచారి బీసీ జేఏసీ ఘన నివాళి

**ప్రజాపక్షం/బోధన్ః** బీసీ రిజర్వేషన్ సాధన కోసం ఆత్మ బలిదానం చేసుకున్న సాయి ఈశ్వర చారి కి బీసీ జేఏసీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బీసీ సంఘాల నాయకులు రవీందర్ యాదవ్, సుధాకర్ చారి, గోపి, కిషన్‌లు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల స్వార్థ రాజకీయాలకు మరోక విశ్వకర్మ బిడ్డ బలైన విషాద ఘటన రాష్ట్ర ప్రభుత్వ విధానాల వైఫల్యాన్ని స్పష్టంగా చూపిస్తుందన్నారు. ప్రభుత్వాల మోసపూరిత హామీలను ప్రజలు తిరస్కరించాలని నేతలు కోరారు. ఈ కార్యక్రమంలో అశోక్ రెడ్డి, భాస్కర్ చారి, ఉదయ్, మసుల శ్రీనివాస్, గోపి, రవీశంకర్ గౌడ్, శంకర్ గౌ డ్, హన్మండ్లు చారి, శేఖర్, జిమ్ శ్రీను, అశోక్ చారి, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ఆటో జేఏసీ రాష్ట్ర సభను విజయవంతం చేయాలి

**ప్రజాపక్షం/బోధన్ః** ఈ నెల 9వ తేదిన బాన్సువాడ నియోజకవర్గం వర్ని మండల కేంద్రంలో నిర్వహించే ఆటో జేఏసీ రాష్ట్ర సభను విజయవంతం చేయాలని ఆటో జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు మంద రవి కుమార్ కోరారు. శనివారం బోధన్ పట్టణంలోని ఆటో స్టాండ్ వద్ద ఆటో డ్రైవర్లకు కార్యక్రమ కరపత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2023 ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలు ఆటో సంక్షేమ బోర్డు నెలకు 12వేలు, తదితర హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. స్థానిక ఎన్నికల కంటే ముందే ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీఎం ను వారు కోరారు. డిమాండ్లను నెరవేరని పక్షంలో ఆటో డ్రైవర్ల సత్తా చూపెడతామని హెచ్చరించారు. రషీద్, బాబర్ఖాన్, హైమద్, మజ్జుఖాన్, లడ్డు తదితరులు పాల్గొన్నారు.

## 26 వార్డులు ఏకగ్రీవం

**ప్రజాపక్షం / నందిపేట్ :** నందిపేట్ మండలంలో ఈ ఎన్నికలలోనామినేషన్ల పరిశీలన అనంతరం ఒకే నామినేషన్ రావడంతో 26 వార్డులు ఏకగ్రీవం అయినట్టు మండల అభివృద్ధి అధికారి శ్రీనివాస్ రావు తెలిపారు. జోజిపేట్ గ్రామ పంచాయతీలో వార్డు సభ్యులు రెండవ వార్డులో నామినేషన్‌కు బదులు మూడవ వార్డులో నామినేషన్ వేయడం వల్ల దాన్ని తిరస్కరించినట్టు తెలిపారు. మండలంలో 22 గ్రామ పంచాయతీలకు 97 నామినేషన్లు రాగా, 208 వార్డులకు 526 నామినేషన్లు వచ్చినట్టు తెలిపారు.

## అయిలాపూర్‌లో చంద్రమౌళీశ్వర ఆలయంలో ఉత్సవాలు

**ప్రజాపక్షం / నందిపేట్ :** నందిపేట్ మండలంలోని చంద్రమౌళీశ్వర ఆలయంలోఉత్సవాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా భజన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం, పల్లకి సేవ ఉంటుందని గ్రామాభివృద్ధి కమిటి తెలిపింది. ఆదివారం యజ్ఞం పూజా కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు.

## చర్లపల్లి గ్రామ పాలకవర్గం ఏకగ్రీవం కావడం అబినందనీయం

**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** జగిత్యాల రూరల్ మండలం చర్లపల్లి గ్రామంలో సర్పంచ్‌గా మేడిపల్లి సునీత ఆనంద్ రెడ్డి ఉప సర్పంచ్ సుమన్ మరియు వార్డ్ సభ్యులు విజయ స్వరూప విజయ్ రాజేందర్ రాజి రెడ్డి గార్లు ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా గ్రామ సర్పంచ్ వార్డ్ మెంబర్లు ఉపసర్పంచ్ గ్రామస్తులు కలిసి జిల్లా మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్ ని మర్యాదపూర్వకంగా కలవగా వారికి శుభాకాంక్షలు తెలియజేసి శాలువతో జిల్లా మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్ సత్కరించారు. సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డ్ సభ్యులు అందరూ కూడా ఏకగ్రీవమై ఎన్నుకుని చర్లపల్లి గ్రామాన్ని ఆదర్శంగా నిలిచారన్నారు. కేసీఆర్ నాయకత్వంలో జెడ్పీ చైర్పర్సన్ గా ఉన్నప్పుడు చర్లపల్లి గ్రామ అభివృద్ధికి అండగా ఉన్నామని, మున్ముందు చర్లపల్లి గ్రామ అభివృద్ధిలో తమ వంతు సహకారం ఉంటుందని అన్నారు. జగిత్యాల రూరల్ మండల అధ్యక్షుడు ఆనంద్ రావు, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కమలాకర్ రావు, మాజీ సర్పంచ్ ఎల్లా రాజన్న, చర్లపల్లి గ్రామస్తులు, తదితరులు ఉన్నారు.

# ఘనంగా అంబేద్కర్ వర్ధంతి



**ప్రజాపక్షం/బాల్కొండ ః** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్‌ఎస్ఎస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించినట్లు పోగ్రాం ఆఫీసర్ మురళి తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలను ప్రతిఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని, కుల, మత బేధం అని తేడా లేకుండా ప్రతిఒక్కరికి ఓటు హక్కు కల్పించిన ఘనత అంబేడ్కర్ దేనని తెలిపారు. కటిక పేదరికం నుండి ఒక ఉన్నతమైన స్థానానికి అంబేడ్కర్ ఎదగటం జరిగిందని ఆయనను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు కూడా కష్టపడే చదవాలని కోరారు. కార్యక్రమంలో అనిత, దామోదర్, సాయిప్రసాద్, అనూష, యశస్విని, మురళి, విద్యార్థులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం / నందిపేట్ :** నందిపేట్ మండల కేంద్రంలో శనివారం అంబేడ్కర్ వర్ధంతి ఘనంగా జరుపుకున్నారు. అన్ని గ్రామాలలో రాజకీయ నాయకులు పూల దండలు వేసి నివాళులు అర్పించారు. కొందరు నాయకులు దూరంగా ఉండడం కనిపించింది.

**ప్రజాపక్షం/ఎడపల్లిం:** డా.బి.ఆర్ అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకొని ఎడపల్లి మండలంలోని పలు గ్రామాల్లో శనివారం అంబేడ్కర్ 69వ వర్ధంతిని నిర్వహించారు. ఈ మేరకు మండలంలోని ఆయా గ్రామాలలో అంబేడ్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దళిత సంఘం నాయకులు, అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అలాగే సాటాపూర్ గేట్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పలువురు మండల దళిత సంఘం నాయకులు పూలమాలలు వేసి వర్ధంతిని నిర్వహించారు. జాన్కంపేట్ గ్రామంలో గాంధీ అంబేడ్కర్ చౌరస్తాలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ.. అంబేడ్కర్ అన్ని వర్గాల ప్రజలకు సమాన హక్కులు కల్పించేందుకు రాజ్యాంగాన్ని రచించారన్నారు. ఆయన చూపిన బాటలో అందరూ నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల దళిత సంఘం నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# సమాజసేవకు, శాంతి భద్రతలకు దృఢమైన మద్దతు హోంగార్డ్స్

## నిజామాబాద్ పోలీసు కమిషనర్ పి.సాయి చైతన్య

**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** హోంగార్డులు అంటే సమాజసేవకు, శాంతి భద్రతలకు ఒక దృఢమైన మద్దతు అని నిజామాబాద్ పోలీసు కమిషనర్ పి.సాయి చైతన్య అన్నారు. శనివారం పోలీసు పరేడ్ మైదానంలో 63వ హోం గార్డ్స్ రైసింగ్ డే కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరై ముందుగా హోం గార్డుల గౌరవ వందనం స్వీకరించి, పరేడ్ కార్యక్రమం వీక్షించారు. అనంతరం ఈ మధ్యకాలంలో విధి నిర్వహణలో అత్యుత్తమ సేవలు అందించిన హోంగార్డులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్బంగా మాట్లాడుతూ దేశ సేవలో నిరంతరం శ్రమిస్తున్న ప్రతి హోం గార్డు సోదర, సోదరీమణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. 1946 డిసెంబరు 6న ముంబైలో హోం గార్డు సంస్తను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. హోంగార్డులు అంటే కేవలం ఒక విభాగం కాదు అది సమాజ సేవకు, శాంతి భద్రతలక ఒక దృఢమైన మద్దతు, మన దేశ సరిహద్దులలో సైన్యంతోపాటు, మన రాష్ట్రాల లోపల పోలీసులు, ఇతర విపత్తు నిర్వహణ సంస్థలతో కలిసి చేస్తున్న సేవ వెలకట్టలేనిదని అన్నారు. వీరి సేవలు శాంతి భద్రతలకు, ప్రకృతి విపత్తులకు, రవాణా, ట్రాఫిక్ నిర్వహణల ప్రభుత్వ కార్యక్రమాల అమలులో వీరి పాత్ర అసాధారణమైనదని అన్నారు. కార్యక్రమంలో అదనపు డిసిపి (అడ్మిన్)బస్వారెడ్డి, రిజర్వు ఇన్స్‌పెక్టర్ సతీస్ (హోంగార్డు), శేఖర్ బాబు (ఎంటిఓ), శ్రీనివాస్ (అడ్మిన్), తిరుపతి (వెల్ఫేర్), ఆర్.ఎస్.ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.




## విద్యుత్ షాక్‌తో మేక మృతి

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని గంగాదేవి పల్లి గ్రామానికి చెందిన కొలకాని రవి కి చెందిన మేక గ్రామ సమీపాన ఉన్న విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ వద్ద కరెంట్ షాకు గురై అక్కడికక్కడే మృతి చెందింది.గ్రామానికి చెందిన కొలకాని రవి దినచర్యలో భాగంగా మేకలను మేత కోసం మేపడానికి తీసుకు వెళుతుండగా విద్యుత్ ట్రాన్స్ పార్మర్ చుట్టూ ఏర్పాటు చేసిన ఇనుప కంచెకు కరెంటు సరఫరా కావడంతో మేకకు విద్యుత్ షాక్ తగలడంతో మృతి చెందింది. గ్రామానికి చెందిన కొలకాని రవి మేకలను మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు.శనివారం రవి మేకలను మెపడానికి తీసుకు వెళుతుండగా ట్రాన్స్ పార్మర్ చుట్టూ ఏర్పాటు చేసిన ఇనుప కంచెకు విద్యుత్ సరఫరా కావడంతో మేకకు కరెంట్ షాకు తగిలి ప్రాణాలు వదిలినట్టు బాధితుడు కన్నీరు మున్నీరుగా విలపిస్తూ తెలిపాడు . దాదాపు దాని విలువ 20 వేల రూపాయల వరకు ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు స్పందించి తనకు ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని రైతు కొలకాని రవి విద్యుత్ అధికారులను కోరారు.

## ఆశీర్వదించి గెలిపిస్తే అండగా ఉండి సేవ చేస్తా

**ప్రజాపక్షం /మల్లాపూర్ :** సర్పంచ్ ఎన్నికల్లో తనను ఆశీర్వదించి గెలిపిస్తే కుస్తాపూర్ ప్రజలకు అండగా ఉండి సేవ చేస్తానని కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి జెల్ల నాగమణి అన్నారు. ఈ మేరకు శనివారం గ్రామంలో గడపగడపకు ప్రచారం చేపట్టి భారీ మెజార్టీతో గెలిపిస్తే వెన్నంటే ఉండి గ్రామ ప్రజలకు సేవ చేస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ నాయకులు సరికేల మహిపాల్ మద్దతుదారులు ఉన్నారు. సిరిపూర్ గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని ఆశీర్వదించి సర్పంచ్ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి పెంట సౌజన్య, శ్రీనివాస్ అన్నారు.

# భక్తోత్సవంతో అయ్యప్పస్వాముల మహాపడిపూజ

ప్రజాపక్షం/ముధోల్ : నియోజకవర్గ కేంద్రమైన ముధోల్‌లోని శ్రీ పశుపతినాథ్ ఆలయ ఆవరణలో శనివారం అయ్యప్ప స్వాముల మహాపడిపూజ ఘనంగా జరిగింది.ముధోల్ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో మహాపడిపూజ మహోత్సవ పండుగ నిర్వహించారు.గురుస్వామి బ్రహ్మశ్రీ సుబ్బారావు గురు స్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామికి పంచామృతాలతో అభిషేకం చేశారు.గణపతి,సుబ్రహ్మణ్యం,కుమార స్వామి చిత్రపటాలను అలంకరించారు.దీంతో గురు స్వామి మాట్లాడుతూ అయ్యప్ప మాలధారణ మోక్షానికి మార్గమని తెలిపారు.అయ్యప్ప స్వామి నామస్మరణతో సకల రోగాలు దూరం అవుతాయని వెల్లడించారు .నియమనిష్టలతో అయ్యప్ప మాలను ధరించిన వారికి స్వామి వారిఆశీస్సులు ఎల్లప్పుడు ఉంటాయన్నారు. స్వామియే శరణం అయ్యప్ప శరణం అంటూ ఆలయ ప్రాంగణం మార్మోగింది.మహాపడి పూజలో అయ్యప్ప సేవా సమితి సభ్యులు.గురు స్వాములు పోతన్న యాదవ్ ఆధ్వర్యంలో పవన్ పటేల్,గోసుల రాజు,సాయినాథ్(18వ నరికేళ) దీక్ష చేపట్టడంతో వారికి అయ్యప్ప అనుగ్రహం ఎల్లప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు.మహా పడిపూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలను చేసి మొక్కులను తీర్చుకున్నారు.పడిపూజ మహోత్సవానికి మండల కేంద్రమైన ముధోల్ తో పాటు లోకేశ్వరం,బైంసా,తానూర్,బాసర,తోపాటు పక్క రాష్ట్రమైన మహారాష్ట్ర నుండి అయ్యప్ప స్వాములు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.అనంతరం వచ్చిన భక్తులందరికీ భిక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్ర



మంలో గురు స్వాములు అనిల్,బాలాజీ,మూడ సురేందర్,గంగాధర్ డప్పు,రాజేశ్వర్,భూషణ్,నరేందర్ తో పాటు స్వాములు పాల్గొన్నారు.

## మల్లూర్ తాండా పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యులు ఏకగ్రీవం



ప్రజాపక్షం/నిజాంసాగర్: నిజాంసాగర్ మండలంలోని మల్లూరుతాండా గ్రామపంచాయతీ సర్పంచుతో పాటు వార్డు సభ్యులను గ్రామస్థులు శనివారం ఏకగ్రీవం చేశారు. విశ్రాంత ఉపాధ్యాయుడు నారాయణనాయక్‌ను సర్పంచుగా ఏకగ్రీవంగా ఎన్నుకోగా పంచాయతీలోని 8 వార్డు సభ్యులను సైతం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామాభివృద్ధే లక్ష్యంగా తాండాను పంచాయతీ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తాండావాసులు పేర్కొన్నారు. సర్పంచు నారాయణనాయక్ మాట్లాడుతూ తాండాను మండలంలో, జిల్లాలో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు తనవంతు కృషిచేస్తానని పేర్కొన్నారు.

### మహాలక్ష్మి ఆలయ వార్షికోత్సవ కరపత్రాలను విడుదల చేసిన శ్రీహరిరావు



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : నిర్మల్ పట్టణంలోని బంగాల్పేట్లోని మహాలక్ష్మి ఆలయ మూడవ వార్షికోత్సవం కరపత్రాలను శనివారం కాంగ్రెస్ పార్టీ నిర్మల్ నియోజకవర్గ ఇన్చార్జి శ్రీహరి రావు విడుదల చేశారు.ఈ సందర్భంగా మహాలక్ష్మి గుడి చైర్మన్ కొడకల శ్రీకాంత్ వార్షికోత్సవానికి రావాల్సిందిగా శ్రీహరిరావును,అలాగే నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ్‌రెడ్డి ని ఆహ్వానించారు.ఈ నెల 15 సోమవారం నిర్వహించే వారికోత్సవం కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు రావాలని వారు కోరారు.మధ్యాహ్నం ఆలయం వద్ద మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో బంగాల్పేట్ యువజన సంఘం అధ్యక్షుడు పెండం శ్రీను,సంఘ సభ్యులు నరేష్ గౌడ్,కారే సుధాకర్,గాజుల రవి కుమార్,తదితరులు పాల్గొన్నారు.

### ప్రగతి మైదానంలో కోతుల బెడద

ప్రజాపక్షం / శ్రీరాంపూర్ : శ్రీరాంపూర్ ప్రాంతంలోని ప్రగతి మైదానంలో కోతుల బెడద తీవ్రం కావడంతో వాకర్స్ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆరోగ్య సంరక్షణ కోసం నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్, వ్యాయామం చేసేందుకు మైదానానికి వచ్చే ప్రజలు వానరాల గుంపును చూసి భయభ్రాంతులకు గురవుతున్నారు. అయితే గత కొంతకాలంగా ఈ ప్రాంతంలో కోతుల సంచారం అధికం కావడంతో గ్రౌండ్ కు వచ్చేవారు వెనుతిరుగుతున్నారు. ఎలాంటి ప్రమాదకర సంఘటనలు జరగకముందే సంబంధిత అధికారులు స్పందించి కోతుల బెడద నివారించాలని పలువురు వాకర్స్ కోరుతున్నారు.

### ఆర్టీసి కార్గోలో పాత వస్తువుల వేలం

ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ : మంచిర్యాల ఆర్టీసి కార్గో కౌంటర్‌లో వినియోగదారులు తీసుకుపోని పాత వస్తువలను ఈ నెల 8వ తేదీన వేలం వేయనున్నట్లు మంచిర్యాల ఆర్టీసి డిపో మేనేజర్ టి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. అవసరాల కోసం వివిధ ప్రాంతాలకు పంపించడం, తెప్పించుకోవడం జరుగుతుందని ఇందులో తీసుకుపోని వినియోగాదరుల వస్తువులను వేలం వేస్తున్నట్లు తెలిపారు. మంచిర్యాల పరిసర ప్రాంత ప్రజలు అవసరమైన వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

## అభ్యర్థులు డబ్బులు ఖర్చు చేసి అప్పల పాలు కావద్దు

### బిజెపి జిల్లా అధ్యక్షుడు రితీష్ రాథోడ్

ప్రజాపక్షం/ఖానాపూర్ : కేంద్రం నిధులతోనే గ్రామాల అభివృద్ధి.ఈ విషయాన్ని అభ్యర్థులు గ్రామాల్లో ప్రచారం చెయ్యాలి అని బిజెపి శ్రేణులకు నిర్మల్ జిల్లా అధ్యక్షులుకి రితేష్ రాథోడ్ సూచించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామ పంచాయతీలకు జరుగుతున్న ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు ఎన్నికల్లో డబ్బులు ఖర్చు చేసి,అప్పుల పాలు కావద్దని,ఆలా అయినా అప్పులు కట్టలేక ఇబ్బందులు పడవద్దని అన్నారు.గ్రామీణ రోడ్లు,పిఎం కిసాన్ నిధులు,మరుగుదొడ్లు,గ్రామీణ ఉపాధి హామీ పథకం,వీధి దీపాలు,స్మశాన వాటికల నిర్మాణం,ఇతర అభివృద్ధి పనులు,కేంద్రం నిధులతోనే కొనసాగు తున్నాయని,గ్రామపంచాయతీ ఎన్నికల్లో కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లి,ప్రజలను చైతన్య పరచాలని,ప్రధానమంత్రి చేస్తున్న అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు.బిజెపి సర్కార్ గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉందని,రాబోయే రోజుల్లో కూడా గ్రామాల అభివృద్ధికి మరిని నిధులు మంజూరు చేసి,అభివృద్ధి చేయనున్నట్లు



ఆయన పేర్కొన్నారు.అనంతరం అంబెడ్కర్ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ఆకుల శ్రీనివాస్,జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లా రవీందర్‌రెడ్డి,అసెంబ్లీ కన్వీనర్ అంకం మహేందర్,జిల్లా కార్యదర్శి మాదిరే శ్రీనివాస్,పట్టణ అధ్యక్షుడు కీర్తి మనోజ్ మండల అధ్యక్షుడు పుప్పాల ఉపేందర్,పట్టణ ప్రధాన కార్యదర్శి కొండవేని రమేష్,సీనియర్ నాయకులు పోల్సాని అనిల్ రావు నారయణ, అజయ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన పొంకూరు,కప్పనపల్లి ఏకగ్రీవం

ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ : సారంగాపూర్ మండలం స్వర్ణ(పొన్కుర్)గ్రామ సర్పంచ్ గా కొత్తింటి మల్లేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.నామినేషన్ల ఉపసంహరణ గడువు శనివారం ముగిసింది.కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి అబ్దుల్ ఆసిఫ్ నామినేషన్ ఉపసంహరించుకోవడంతో మల్లేష్ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ నిర్మల్ నియోజకవర్గ ఇన్చార్జి కూచాడి శ్రీహరి రావు సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నికైనా మల్లేష్ హస్తం పార్టీల చేరారు.అలాగే మామడ మండలం కప్పన్ పల్లి గ్రామ సర్పంచ్ గా చందు బాపు లింగన్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.వీరిని శ్రీహరిరావు కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించి అభినందించారు.ఇందులో నిర్మల్,సారంగాపూర్ మార్కెట్ కమిటి చైర్మన్‌లు సోమభీమ్ రెడ్డి,అబ్దుల్



హదిల్,సారంగాపూర్ మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజ మొహమ్మద్,మాజీ ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి,కొంకూరు స్వర్ణ గ్రామ మాజీ సర్పంచ్,కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# అంబేద్కర్‌కు ప్రముఖుల నివాళి

ప్రజాపక్షం/ఖానాపూర్: అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఖానాపూర్ పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి వేరు.వేరుగా నివాళులు అర్పించిన ఎమ్మెల్యే,డిసిసి అధ్యక్షుడు వెడ్మ బొజ్జు పటేల్ ఖానాపూర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అంబేద్కర్ చిత్ర పటానికి,పట్టణంలోని స్థానికంగా ఉన్న విగ్రహనికి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సామాజిక న్యాయం,సమానత్వం కోసం నిరంతరం పోరాడిన మహానుభావులు,ఆయన చూపిన మార్గం పేదలు,బడుగుబలహీన వర్గాలకు వెలుగునిచ్చింది.వారి ఆశయాలకు సాధనకు మనమందరం పునరంకితమవుదామని,అంబేద్కర్ ఆశయాలే ప్రజాస్వామ్య బలానికి పునాదులని అన్నారు. తెలంగాణ స్వరాష్ట్రం సాధించుకోవడానికి రాజ్యాంగంలోని బాబాసాహెబ్ చొరవతో ఏర్పాటు చేసిన ఆర్టికల్ 3 ఎంతగానో దోహద పడిందని అణగారిని వర్గాల అభ్యున్నతికి అంబేద్కర్ చూపిన బాటలోనే అందరూ అందరం ప్రయాణిస్తున్నామని తెలియజేశారు.కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం/ఖానాపూర్ : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతిని శనివారం ఖానాపూర్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు.పట్టణంలో బిఆర్ఎస్ ఖానాపూర్ ఇన్చార్జి భూక్యా జాన్సన్ నాయక్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ రాజ్యాంగా నిర్మాత బీఆర్ అంబేద్కర్ సామాజిక న్యాయం,సమానత్వం కోసం నిరంతరం పోరాడారని అన్నారు.ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడానికి రాజ్యాంగంలో ఎన్నో సంస్కరణలు ప్రవేశపెట్టారన్నారు.



## దివ్యాంగ విద్యార్థులకు క్రీడా పోటీలు



ప్రజాపక్షం/నిజాంసాగర్: మహ్మద్‌నగర్ మండలకేంద్రంలోని మండల విద్యావనరుల కేంద్రంలో శనివారం దివ్యాంగులైన విద్యార్థులకు ఉపాధ్యాయులు క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులకు డ్రాయింగ్, ఆటపోటీలు నిర్వహించగా ప్రత్యేక అవసరాలు గల పిల్లల పట్ల తల్లితండ్రులకు పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, కాంప్లెక్స్ హెచ్‌ఎం రాజు, ఐఈఆర్‌పీ చిన్నసాయిలు, విద్యార్థుల తల్లితండ్రులు, అద్యాపకబృందం తదితరులు పాల్గొన్నారు.

### అంబేద్కర్‌కు నివాళులర్పించిన డిసిసి చైర్మన్



ప్రజాపక్షం/నిజాంసాగర్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా నిజాంసాగర్ మండలకేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ శనివారం పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ సమానత్వం, న్యాయం, హక్కుల కొరకు అంబేద్కర్ చూపిన మార్గం నేటికి ప్రతీ ఒక్కరికి ప్రేరణ అన్నారు. ఈ కార్యక్రమంలో పిట్లం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ చీకోటి మనోజ్‌కుమార్, మండల కాంగ్రెస్ నాయకులు, గ్రామ అధ్యక్షుడు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాజీ ఎంపిటిసి ఆత్మహత్య ఘటన దురదృష్టకరమైనది

ప్రజాపక్షం/ఖానాపూర్ : ఖానాపూర్ మండలం సోమార్‌పేట్ గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు,మాజీ ఎంపీటీసీ,సర్పంచ్ అభ్యర్థినీ పుష్ప భర్త బండారి రవీందర్ ఆత్మహత్య ఘటన అత్యంత దురదృష్టకరమైనదని డీసీసీ అధ్యక్షుడు ఖానాపూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు.గత 25 ఏళ్లుగా ప్రజా సేవలో ఎల్లప్పుడు ముందుండే నాయకుడు ఇలా మన మధ్య లేకపోవడం తీరని లోటు అని ఆయన పేర్కొన్నారు.సోమార్‌పేట్ గ్రామానికి వెళ్లి,వారి చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించి,బండారి రవీందర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.శోకసంద్రంలో ఉన్న కుటుంబసభ్యుల మానసిక వేదనను చూసి భావోద్వేగనికి గురయ్యారు.ఈ క్లిష్ట సమయంలో రవీందర్ కుటుంబాలనికి అని విధాలుగా నా తరుపున, కాంగ్రెస్ పార్టీ తరుపున సంపూర్ణ సహకారం ఉంటుందని ధైర్యం చెప్పారు. మండల,స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటించాలి

### జిల్లా ఎస్‌పి నితికా పంత్

**ప్రజాపక్షం / కాగజ్ నగర్ :** రానున్న గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా ప్రతి ఒక్కరూ ఎన్నికల ప్రవర్తన నియమావళిని పాటించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కొమరం భీమ్ జిల్లా ఎస్‌పి నితికా పంత్ హెచ్చరించారు. శనివారం కాగజ్‌నగర్ పట్టణంలో శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్లాగ్ మార్చ్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా, నిష్పాక్షికంగా, శాంతియుతంగా జరగడానికి పోలీస్ భద్రత పూర్తి చేశామని తెలిపారు. ప్రజల్లో నమ్మకం పెంపొందించడం, అవాంఛనీయ చర్యలను అరికట్టడమే ఈ ఫ్లాగ్ మార్చ్ ఉద్దేశమని పేర్కొన్నారు. ఎవరైనా గందరగోళం సృష్టించడం, బెదిరింపులకు పాల్పడటం, అక్రమ ప్రవర్తనలు చేయడం, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘించడం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అనుమతి లేకుండా ఎలాంటి ర్యాలీలు నిర్వహించరాదని సూచించారు. డబ్బులు, మద్యం, బహుమతుల ద్వారా ఓటర్లను ప్రభావితం చేసే ప్రయత్నాలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో మూడు ప్రధాన చెక్ పోస్టులను ఏర్పాటు చేశామని, ఎన్నికల సమయంలో ప్రజల భద్రతకు భంగం వాటిల్లితే తక్షణమే స్పందించేందుకు ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని వివరించారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ డిఎస్‌పి వాహీదుద్దీన్, టౌన్ ఎస్‌ఐ ప్రేమ్ కుమార్, రూరల్ ఇన్స్పెక్టర్ కుమారస్వామి, ఎస్‌ఐలు సుధాకర్, సందీప్, కళ్యాణ్, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

### మంచిర్యాల ఎసిపి ప్రకాశ్

**ప్రజాపక్షం / దండేపల్లి :** ప్రజాస్వామ్య పండుగలో ఓటు హక్కును ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా వినియోగించుకోవాలని, ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగిస్తే సహించేది లేదని మంచిర్యాల ఎసిపి ప్రకాశ్ స్పష్టం చేశారు. రానున్న పంచాయతీ ఎన్నికల సందర్భంగా ప్రజలకు భరోసా కల్పించేందుకు శనివారం దండేపల్లి మండలం వెల్గనూర్ గ్రామంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎసిపి మాట్లాడుతూ ఓటు వజ్రాయుధం లాంటిదని, ఎవరూ భయపడవద్దని సూచించారు. సామాన్య ప్రజలు, ముఖ్యంగా వృద్ధులు, మహిళలు ఎలాంటి బెదిరింపులకు భయపడకుండా ఓటు వేయాలని, పోలీసులు ప్రజల వెంటే ఉన్నారని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడినా, మద్యం, డబ్బు పంపిణీ చేసినా, ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసినా చట్టం తన పని తాను చేసుకుపోతుందని పేర్కొన్నారు. సమస్యాత్మక గ్రామాలపై, గతంలో గొడవలు జరిగిన గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంటుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో లక్సెట్టిపేట సిఐ రమణమూర్తి, దండేపల్లి ఎస్‌ఐ తహసీనోద్దీన్, లక్సెట్టిపేట, జన్నారం ఎస్‌ఐలు సురేష్, అనూష, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




# రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడు అంబేద్కర్

### కలెక్టర్ కుమార్ దీపక్


**ప్రజాపక్షం / నస్పూర్ :** భారతదేశానికి మహోన్నతమైన రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం నస్పూర్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థ కలిగిన భారత దేశానికి అంబేద్కర్ రాజ్యాంగం అందించారని, మొదటి కేంద్ర న్యాయ శాఖ మంత్రిగా విశిష్ట సేవలు చేశారని తెలిపారు. సంఘసంస్కర్తగా అంటరానితనాన్ని రూపుమాపేందుకు కృషి చేశారని, న్యాయవాదిగా, అధ్యాపకుడిగా, ఆర్థికవేత్తగా దేశానికి సేవలు అందించారని గుర్తుచేశారు. ఆయన సేవలకు గుర్తింపుగా అత్యున్నత పౌర పురస్కారం భారతరత్నతో గౌరవించారని, దేశ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి పోయారని పేర్కొన్నారు. మహనీయుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్, జిల్లా సహకార అధికారి హనుమంత రెడ్డి, కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# ఘనంగా అంబేద్కర్ వర్ధంతి



**ప్రజాపక్షం / వాంకిడి :** వాంకిడి మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్ ప్రాంగణంలో శనివారం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 69వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ యువజన సంఘం, భారతీయ బౌద్ధ మహాసభ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీనియర్ బౌద్ధ ఉపాసకులు, భారతీయ బౌద్ధ మహాసభ గౌరవ అధ్యక్షులు జయరాం ఉప్రే నీలి రంగు జెండాను ఆవిష్కరించారు. అంతకుముందు బుద్ధుడు, అంబేద్కర్ చిత్రపటాలకు పూలు సమర్పించి కొవ్వొత్తులు వెలిగించారు. ఈ కార్యక్రమంలో భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షులు అశోక్ మహుల్కర్, సమతా సైనిక్ దళ్ జిల్లా అధ్యక్షులు దుర్గం సందీప్, భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా కోశాధికారి దుర్గం తిరుపతి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గుర్నులే నారాయణ, అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షులు దుర్గం దుర్గాజి, ప్రధాన కార్యదర్శి విజయ్ ఉప్రే, సునీల్, హంసరాజ్, రోషన్ ఉప్రే, ప్రతాప్, శ్రీనివాస్, శ్యామరావు లహుజీ దర్గే, రాజేశ్వర్ ఉప్రే, రామ బాయి, గంగూబాయి, మాజీ సిడిపిఒ సరోజ, కాంగ్రెస్ పార్టీ యువజన అధ్యక్షులు, నాయకులు దుర్గం పెంటు, విఠల్, రమేష్ మనోజ్ భీమ్రావు, అన్నారావు, నూతన్, రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.



**ప్రజాపక్షం / జన్నారం :** జన్నారం మండల కేంద్రంలో శనివారం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జన్నారం అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షులు సిటిమన భరత్ కుమార్, సంఘం నాయకులు బోర్లకుంట ప్రభుదాస్, టిఆర్‌ఎస్ మండల అధ్యక్షులు గుర్రం రాజారాం రెడ్డి, బిజెపి మండల అధ్యక్షులు మధుసూదన్ రావు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు దుమ్మల రమేష్, నాయకులు బాలసాని శ్రీనివాస్ గౌడ్, సులువ జనార్ధన్, ఇందయ్య, ప్రవీణ్ కుమార్, అంబేద్కర్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ కు మరణం లేదు



**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :** దేశాభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కు మరణం లేదని, ప్రజల గుండెల్లో ఆయన సదా సజీవంగానే ఉంటారని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు జెల్లి సతీష్, ఉపాధ్యక్షులు నేలబోయిన కుమార్ అన్నారు. శనివారం శ్రీరాంపూర్ ప్రాంతంలోని అంబేద్కర్ గ్రౌండ్ లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అణగారిన దళిత, బహుజన వర్గాల అభ్యున్నతి కొరకు పాటుపడిన మహా వ్యక్తి అంబేద్కర్ అని కొనియాడారు. ప్రపంచ దేశాలు గర్వించే విధంగా దేశ ప్రజల కొరకు భారత రాజ్యాంగాన్ని లిఖించిన గొప్ప వ్యక్తి అని పేర్కొన్నారు. ఆయన ఆశయాల సాధన కొరకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని, రాజ్యాంగాన్ని రక్షించుకొని దేశాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు జాగిరి రాజేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ కే తిరుపతి, రెడపాక లక్ష్మణ్, జె రాజశేఖర్, సాయి గౌడ్, వేముల శ్యామ్, సురేందర్, సృజన్, వినోద్, యుగంధర్ సాయి పాల్గొన్నారు.

# మహిళలు, పిల్లలకు ఆటలు దీపాలంకరణ పోటీలు

**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :** సింగరేణి ఆవిర్భావ దినోత్సవం వేడుకల సందర్భంగా ఏరియాలోని మహిళలు, పిల్లలకు ఆటలు, దీపాలంకరణ పోటీలు నిర్వహించనున్నట్లు ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ తెలిపారు. శనివారం ఆయన ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. నస్పూర్ లోని సేవా భవన్ లో ఈనెల 11వ తేదీన, శ్రీరాంపూర్ ప్రగతి మైదానం సిఇఆర్ క్లబ్ లో 12వ తేదీన సాయంత్రం 5 గంటల నుండి పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. మహిళలకు బాంబు బ్లాస్ట్, తగ్ ఆఫ్ వార్, త్రో బాల్, పిల్లలకు బాంబు బ్లాస్ట్, 50 మీటర్ల పరుగు పందెం పోటీలు ఉంటాయని వివరించారు. అలాగే 15న నస్పూర్ సేవా భవన్, 16న శ్రీరాంపూర్ సిఇఆర్ క్లబ్ లో మహిళలకు దీపాలంకరణ పోటీలు ఉంటాయని తెలిపారు. ఈ పోటీలలో గెలుపొందిన వారికి 23న జరిగే సింగరేణి ఆవిర్భావ దినోత్సవం వేడుకలలో బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు.

# పెండింగ్ బకాయిలు వసూలు చేస్తున్న బల్దియ అధికారులు



**ప్రజాపక్షం/బోధన్:** బోధన్ పట్టణంలోని మున్సిపల్ పరిధిలో ఉన్న మున్సిపల్ టాక్స్ పెండింగ్ బకాయిలను శనివారం మున్సిపల్ కమీషనర్ ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బందితో కలిసి బకాయిలను రికవరీ చేస్తున్నారు. ఈ సందర్భంగా 43వేల 636రూపాయాలు వ్యాపార, గృహాల టాక్స్ వసూలు చేయడం జరిగిందని తెలిపారు.

# ఎంపిడిఒ కార్యాలయాన్ని పరిశీలించిన సబ్ కలెక్టర్

**ప్రజాపక్షం/బోధన్:** రుద్రూర్ మండల పరిషత్ కార్యాలయాన్ని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహాతో శనివారం సందర్శించారు. పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియతో పాటు మెటీరియల్ విభజనను పరిశీలించారు. రాబోయే జీపీ ఎన్నికల కోసం తదుపరి కార్యచరణపై ఎంపీడీవో, ఎంపీవో కోటగిరికి మార్గనిర్దేశం చేశారు. అనంతరం నెహ్రూ నగర్ జీపీ వద్దకు చేరుకున్న పోలింగ్ కేంద్రాన్ని సబ్ కలెక్టర్ సందర్శించి, పోలింగ్ కేంద్రాలను రెండు గ్రూపులుగా విభజించి అంగన్‌వాడీ కేంద్రంలోఓ మ ఊడు కేంద్రాలు, మిగిలిన ఐదు కేంద్రాలను అదే ఆవరణలో కొత్తగా నిర్మించిన భవనంలో ఓటర్లకు అసౌర్యం కలగకుండా చూడాలని ఎంపీడీఓను ఆదేశించారు.